# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రహదారులు నాగరికతకు చిహ్నమని..అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు.**
2. **రాష్ట్రంలో గుంతల లేని రహదారుల నిర్మాణానికి 826 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**
3. **రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ముగిసింది.**
4. **విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులను చేపట్టేందుకు 42 వేల 362 కోట్ల రూపాయలు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.**
5. **కార్తీకమాసం ప్రారంభం కావడంతో రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలతో పాటు శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ పెరిగింది.**

============================

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రహదారులు బాగుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. రహదారులు బాగుంటే పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలో ఈరోజు ఆయన.. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంక్రాంతిలోపు రాష్ట్రంలో రహదారులపై గుంతలు పూడ్చి ప్రజలకు సుఖవంతమైన ప్రయాణ అనుభూతి కలిగిస్తామని తెలిపారు. రహదారులు నాగరికతకు చిహ్నమని, అభివృద్ధి రాజకీయాన్ని కొనసాగిస్తామని చంద్రబాబునాయుడు పేర్కొంటూ...

...వాయిస్ (40 సెకన్లు)

ఈ కార్యక్రమంలో హోంశాఖ మంత్రి వి. అనిత, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.

---------------------------

రాష్ట్రంలో రహదారులను గుంతల రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి దొడ్డిపట్ల వెళ్లే రహదారిలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ.. వచ్చే సంక్రాంతి నాటికి గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో రహదారుల మరమ్మతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మాముడూరులో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలలో మరమ్మతులు చేపట్టక పోవడంతో రాష్ట్రంలో రహదారులు ధ్వంసమయ్యాయని తెలిపారు. అలాంటి రహదారులలో ప్రయాణం చేసిన పలువురు ప్రాణాలు కోల్పోవడంతో పాటు గాయాల పాలయ్యారన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాంటి రహదారుల మరమ్మతుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నూతన రహదారుల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో గుంతల లేని రహదారుల నిర్మాణానికి 826 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా తొలిసారిగా జిల్లాలో పర్యటించిన ఆయన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అభివృద్ధి తోపాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యచరణ చేపట్టారని వెల్లడించారు. రహదారుల దుస్థితిపై దృష్టి సారించి రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని మంత్రి వివరిస్తూ..

...వాయిస్ ...   21సెకన్లు

---------------------------

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ముగిసింది. వారం రోజుల పర్యటనలో భాగంగా 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ఆయన వరుస సమావేశాలు నిర్వహించారు. పరిశ్రమల ప్రతినిధుల్లో రాష్ట్రంలో పెట్టుబడులపై నమ్మకం కలిగించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలతో పాటు ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు విజన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన ప్రతిపాదనలపై పలు సంస్థలు సానుకూలంగా స్పందించాయి.

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష..టెట్ ఫలితాలను రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 4వ తేదీన విడుదల చేయనున్నారు. గత నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రోజుకు రెండు విడతలుగా టెట్ నిర్వహించగా.. 3 లక్షల 68 వేల 661 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 2వ తేదీన టెట్ ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా.. తుది 'కీ' వెల్లడిలో జాప్యం జరగడంతో ఫలితాల ప్రకటన సోమవారానికి వాయిదా పడింది.

---------------------------

విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులను చేపట్టేందుకు 2024 ధరల ప్రకారం 42

వేల 362 కోట్ల రూపాయలు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. విజయవాడలో రెండు దశల్లో మూడు కారిడార్ల పనులకు 25 వేల 130 కోట్ల రూపాయలు, విశాఖపట్నంలో రెండు దశల్లో నాలుగు కారిడార్ల పనులకు 17 వేల 232 కోట్ల రూపాయలు అవసరమని అంచనా రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం మెట్రోరైలు ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలని.. రెండు నగరాల్లో కలిపి 258 ఎకరాల భూ సేకరణకు అయ్యే 2 వేల 799 కోట్ల రూపాయలు మాత్రం రాష్ట్రప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది.

---------------------------

కార్తీకమాసం ప్రారంభం కావడంతో రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలతో పాటు శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ పెరిగింది. పల్నాడు జిల్లా అమరావతిలోని శ్రీఅమరేశ్వరస్వామి, పశ్చిమగోదావరి జిల్లా గునుపూడిలో శ్రీ ఉమా సోమేశ్వరస్వామి, పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వరస్వామి, కాకినాడ జిల్లా ద్రాక్షారామలోని శ్రీ భీమేశ్వర స్వామి, సామర్లకోటలోని చాళుక్య కుమార భీమేశ్వరస్వామి ఆలయాలతో పాటు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయానికీ భక్తులు పోటెత్తారు. నదీ తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దర్శనాలకు బారులుతీరారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. విశాఖపట్నం–విజయవాడ మధ్య 16 జన్‌సాధారణ్ రైళ్లను నడుపుతున్నారు. నిన్నటి నుంచి ఈ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. విశాఖపట్నం – విజయవాడ జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ రైలు 3, 4, 6, 8, 10, 11, 13 తేదీల్లో విశాఖపట్నంలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంకాలం 4 గంటలకు విజయవాడ చేరుకోనుంది. అలాగే, విజయవాడ – విశాఖపట్నం ప్రత్యేక రైలు విజయవాడలో సాయంకాలం 6 గంటల 30 నిమిషాలకు బయలుదేరి రాత్రి 12 గంటల 35 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలక మండలిలో తిరుపతికి చెందిన భారతీయ జనతా పార్టీ నేత జి.భానుప్రకాష్ రెడ్డికి స్థానం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబితా విడుదల చేసింది. తనకు మరోసారి టీటీడీ పాలకమండలిలో స్థానం కల్పించడంపై భానుప్రకాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం మరింత సులభంగా జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా దేవదాయశాఖ కార్యదర్శి, దేవదాయశాఖ కమిషనర్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ.. తుడా ఛైర్మన్, టీటీడీ కార్యనిర్వహణ అధికారి కొనసాగనున్నారు.

---------------------------

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహా క్షేత్రం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమైంది. భ్రమరాంబ

మల్లికార్జున స్వామి వార్ల ఆలయంలో ఈరోజు నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా 5 వేల రూపాయల గర్భాలయ అభిషేకం టికెట్లను నిలుపుదల చేశారు. భక్తుల రద్దీ కారణంగా శని, ఆది, సోమవారాల్లో మల్లికార్జున స్వామి స్పర్శ దర్శనాన్ని రద్దు చేశారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు స్పర్శ దర్శనం, 1500 రూపాయల సామూహిక అభిషేకం టికెట్లు అందుబాటులో ఉంటాయి. దర్శనం, ఆర్జిత సేవా టికెట్లను భక్తులు దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆలయ అధికారులు వెల్లడించారు.

======================